నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 13 జూన్ 2024 | RANGAREDDY

మోమిన్‌పేటలోని గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్‌లో షర్టులు మాత్రమే రావడంతో వాటిని ధరించిన విద్యార్థులు

సమస్యలతో స్వాగతం

వసతుల కొరతతో విద్యార్థులకు తప్పని కష్టాలు

పూర్తి కాని 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులు

చాలాచోట్ల అందని యూనిఫామ్స్, పుస్తకాలు

మొదటిరోజు బడికి వెళ్లిన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు పూర్తికాక పోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఏ స్కూళ్లో చూసినా పాడైన ఫ్యాన్లు, పాడుబడిన మరుగుదొడ్లు, విరిగిపోయిన నీటి నల్లాలు, అపరిశుభ్రతనే దర్శనమిచ్చింది. చాలా బడుల్లో విద్యార్థులు, పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ అందలేదు.

చేవెళ్లటౌన్ : మరుగు దొడ్డి వెళ్లే మార్గంలో పెరిగిన పిచ్చి మొక్కలు

శంకర్‌పల్లి మండలం పర్వేద ఉన్నత పాఠశాలలో బెంచీలు తుడుస్తున్న విద్యార్థి..

తాండూరు : కరణ్‌కోట ఉన్నత పాఠశాలలో ఫర్నీచర్ దుస్థితి

రుణ లక్ష్యం రూ.850.39కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరం రుణ ప్రణాళిక ఖరారు

మహిళలకు ఆర్థిక బాసట కల్పించే దిశగా గ్రామీణాభివృద్ధి శాఖ ప్లాన్

15,570 మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేలా కార్యాచరణ

గతేడాదితో పోలిస్తే రూ.60 కోట్లకు పెరిగిన లక్ష్యం

గతేడాది స్వయం సహాయక మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు అందజేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ భారీ ఎత్తున రుణాలు అందజేయనున్నది. ఈ మేరకు 15,570 మహిళా సంఘాలకు రూ.850.39కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. గతేడాదితో పోలిస్తే రుణ లక్ష్యం దాదాపు రూ.60కోట్ల వరకు పెరిగింది. ఈసారి అత్యధికంగా మొయినాబాద్ మండలానికి రూ.6,083.39 లక్షలను, అత్యల్పంగా ఆమనగల్లు మండలానికి రూ.1,594.55లక్షలను రుణాలుగా ఇచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటికే సంబంధిత అధికారులు రుణాల పంపిణీకి సంబంధించి కసరత్తును మొదలుపెట్టారు.

-రంగారెడ్డి, జూన్ 12(నమస్తే తెలంగాణ)

మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణాలను అందజేస్తున్నది. మార్చి 30 నాటికి ఆర్థిక సంవత్సరం ముగియడంతో 2024-25కు గాను ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని నిర్దేశిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు పూర్తిస్థాయిలో రుణాలు ఇవ్వడంతో వందశాతానికి పైగానే రుణాలు అందించారు. ఇదే ఉత్సాహంతో ఈ ఏడాదిలోనూ వందశాతం రుణాలిచ్చేలా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పెరుగుతున్న సంఘాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతి ఏటా రుణ లక్ష్యాన్ని పెంచుకుంటూ వస్తున్నది. గతేడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.708.79 కోట్లు రుణాలుగా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే అంతకుమించి రూ.790.46 కోట్ల రుణాలను అందించారు. గతేడాదితో పోలిస్తే రూ.60 కోట్లు అదనంగా ఈ ఏడాది రూ.850.39 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేయనున్నారు.

స్వయం సమృద్ధి దిశగా సంఘాలు..

ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో జిల్లాలోని మహిళా సంఘాలు స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయి. సభ్యుల ఆర్థిక అవసరాల మేరకు వ్యవసాయ, అనుబంధ రంగాలు, కిరాణ దుకాణాలు, పిండిగిర్నీ, టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఫుట్‌వేర్ తదితర వ్యాపారాలకు రుణాలను అందిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన సంఘాలు ఆరు నెలలు క్రమం తప్పకుండా పొదుపు చేస్తే వారికి కూడా విరివిగా రుణాలను అందజేస్తున్నారు. గతంలో బ్యాంకు లింకేజీ కింద రూ.లక్ష రుణం ఇచ్చేవారు. అయితే గత రెండేండ్ల నుంచి దాన్ని రూ.2లక్షలకు పెంచారు. గతేడాది రుణ ప్రగతిలో జిల్లా ప్రత్యేక గుర్తింపును పొందడంతో అదే ఉత్సాహంతో ఈసారి కూడా రుణాలు అందజేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఈ ఏడాదీ లక్ష్యాన్ని అధిగమిస్తాం : శ్రీలత, డీఆర్డీవో, రంగారెడ్డి జిల్లా

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బ్యాంకు లింకేజీ వార్షిక రుణ లక్ష్యం పెరిగింది. ఏటా ప్రభుత్వం నిర్దేశిస్తున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. ఈ ఏడాది నిర్దేశించుకున్న రూ.850.39 కోట్ల రుణ లక్ష్యాన్ని కూడా అధిగమిస్తాం. కలెక్టర్ ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా మండలాల వారీగా సమీక్షలు నిర్వహించి అర్హులైన వారందరికీ రుణాలను అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తాం.

మండలాల వారీగా రుణ లక్ష్యం ఇలా...

మండలం పేరు	సంఘాల సంఖ్య	రుణ లక్ష్యం (లక్షలలో)
అబ్దుల్లాపూర్ మెట్	722	3,839.73
ఆమనగల్లు	286	1,594.55
చేవెళ్ల	978	4,959.33
చౌదరిగూడెం	497	2,366.34
ఫరూఖ్‌నగర్	902	5,822.99
ఇబ్రహీంపట్నం	687	3,526.49
కడ్తాల్	676	3,461.23
కందుకూరు	1,046	5,427.00
కేశంపేట	876	4,835.21
కొందుర్గు	431	2,185.12
కొత్తూరు	301	1,937.43
మాడ్గుల	746	4,102.88
మహేశ్వరం	839	5,153.71
మంచాల	864	4,671.29
మొయినాబాద్	1,071	6,083.39
నందిగామ	485	2,298.30
షాబాద్	806	3,962.21
శంషాబాద్	820	4,620.41
శంకర్‌పల్లి	751	4,712.91
తలకొండపల్లి	876	4,411.04
యాచారం	910	5,068.30
మొత్తం	15,570	85,039.86

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

వికారాబాద్ జిల్లాలో 53,228 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

యాసంగిలో 1.19 లక్షల మెట్రిక్ టన్నుల సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు

11239 మంది రైతుల నుంచి రూ.117.26 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

పెండింగ్‌లో ఇంకా రూ.27 కోట్ల చెల్లింపులు

వికారాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. యాసంగి సీజన్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేసిన దానిలో 50 శాతం మేర కూడా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాకపోవడం గమనార్హం. అయితే జిల్లావ్యాప్తంగా 129 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, 113 కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లా పౌరసరఫరాల శాఖ ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోలు సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావడంతో జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 101 కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మూసివేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి కావడంతో మరో రెండు రోజుల్లో మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా మూసివేయనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ధాన్యాన్ని విక్రయించేందుకు మిగిలిపోయిన రైతులెవరైనా ఉంటే వారి నుంచి సేకరించేందుకు 12 కొనుగోలు కేంద్రాలను మరో రెండు, మూడు రోజులపాటు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు ధాన్యాన్ని విక్రయించిన రైతులకు రెండు, మూడు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తున్నామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వారం రోజులు దాటుతున్నా ధాన్యాన్ని విక్రయించిన రైతులకు చెల్లింపులు పూర్తికావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన రైతులు డబ్బులు కోసం ఎదురుచూడాల్సి వస్తున్నది. కొందరు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి పది రోజులైనా ఇంకా డబ్బులు ఖాతాల్లో జమ కాలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని సేకరించిన అనంతరం వెంటనే బిల్లులు చేయాల్సిన కొనుగోలు కేంద్రాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు 117.26 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించగా, రూ.27 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం. మరోవైపు యాసంగి సీజన్‌కుగాను వడ్లను క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం రూ.2203 మద్దతు ధరను, సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2183 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తున్నది. జిల్లాలో యాసంగిలో 84,848 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు.

53,228 మెట్రిక్ టన్నుల సేకరణ...

జిల్లాలో యాసంగి సీజన్‌కుగాను వరి ధాన్యం సేకరణ పూర్తైంది. జిల్లావ్యాప్తంగా 113 కొనుగోలు కేంద్రాల్లో 53,228 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అయితే ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 19,950 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 15,180 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 16,128 మెట్రిక్ టన్నులు, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల ద్వారా 1860 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని 59 రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 53180 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్స్‌కు సరఫరా చేశారు. అయితే జిల్లాలో యాసంగి సీజన్‌కుగాను 84,848 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా 1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా, కేవలం 53,228 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాలకు రావడం గమనార్హం. అదే విధంగా రైతులకు ఇబ్బందులు కలుగకుండా వరి సాగు చేసిన 4-5 గ్రామాలకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు ఒకేరోజు రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి రాకుండా కొనుగోలు కేంద్రం వద్ద ఐదుగురు చొప్పున రైతులుండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని ఎప్పుడు తీసుకురావాలనేది తేదీతో కూడిన టోకెన్లను అందజేసి జాగ్రత్త పడ్డారు.

వారంలోగా చెల్లింపులు పూర్తి చేస్తాం : జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాం. చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో వారం రోజుల్లోగా జమ అయ్యేలా చూస్తాం. యాసంగి సీజన్‌కుగాను ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావడంతో కొనుగోలు కేంద్రాలను మూసివేశాం. ఇంకా ధాన్యాన్ని విక్రయించని రైతుల సౌకర్యార్థం 12 కొనుగోలు కేంద్రాలను మరికొన్ని రోజులపాటు తెరిచి ఉంచుతాం.

46 స్కూల్ బస్సులపై కేసు నమోదు

రంగారెడ్డి, జూన్ 12(నమస్తే తెలంగాణ) : విద్యా సంస్థల బస్సులపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. 5 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ ఫిట్‌నెస్‌లేని, పన్నులు చెల్లించని 46 బస్సులపై కేసు నమోదు చేశామన్నారు. ఫిట్‌నెస్‌లేని 15 సంవత్సరాలు దాటిన విద్యాసంస్థల బస్సులు ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిప్పరాదన్నారు. అనుభవం గల, 60 సంవత్సరాలు మించని డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. తనిఖీలను కొనసాగిస్తామని, ప్రతి విద్యాసంస్థ బస్సుకు తప్పనిసరిగా సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలన్నారు. తనిఖీల్లో రంగారెడ్డి, మేడ్చల్, ఉప్పల్ రవాణాశాఖ అధికారులు కిరణ్ రెడ్డి, కృష్ణ వేణి, సునీత, నవీన్, ప్రతాప్ రాజా, త్రివేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

వికారాబాద్,జూన్ 12 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని శాసన సభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మోమిన్‌పేట మండల కేంద్రంలోని రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక భవనాన్ని ఆయన జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో రోగులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. మోమిన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరిందని, అ భవనాన్ని ఖాళీ చేసి కొత్త భవనంలోకి మార్చాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు, సౌకర్యలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై స్పీకర్‌తో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పాల్వాన్‌కుమార్‌లను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. అనంతరం దవాఖానలోని వార్డులను పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో వసు చంద్ర, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌సీ కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

చదువుతోనే బంగారు భవిష్యత్తు

విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్, కలెక్టర్ శశాంక

విద్యాభివృద్ధికి సర్కార్ పెద్దపీట

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

'బడిబాట'లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కలెక్టర్ శశాంక

షాద్‌నగర్‌రూరల్,జూన్12: విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని, విద్యార్థి దశనుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా పట్టుదలతో కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి కలెక్టర్ శశాంక విద్యార్థులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సర్కార్ బడుల్లోనే క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చనున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి సర్కార్ పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తరగతిగదుల్లోనే నిర్మాణమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. ప్రతి మూడో శనివారం పాఠశాలలో నిర్వహించే సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా పాల్గొనాలన్నారు. సర్కార్ బడుల్లో ఉన్న విద్యాప్రమాణాలు ప్రైవేటు పాఠశాలల్లో ఉండవని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. పది ఫలితాల్లో 25 ప్రభుత్వ పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత రావడంతోపాటు 50 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, గవర్నర్ సత్యనారాయణతో పాటు ఎంతో మంది మేధావులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఎంతో గొప్ప చరిత్ర గల మొగిలిగిద్ద పాఠశాలకు విద్యార్థులు మరింత వన్నె తీసుకొచ్చేవిధంగా ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు సమకూర్చనున్నట్లు తెలిపారు. తాము సర్కార్ బడుల్లోనే విద్యను అభ్యసించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ఆడపిల్లల చదువులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఉన్నత చదువులతోనే బంగారు భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, డీఆర్డీవో శ్రీలత, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఐసీడీఎస్ అధికారిణి నాగలక్ష్మి, ఎంఈవో శంకర్‌రాథోడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, మండలపార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, అశోక్, గ్రామస్తులు శ్యాంసుందర్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.